నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
4 సెప్టెంబర్ 2024
పేజీలు 8

### కేన్స్ టెక్నాలజీ పెట్టుబడులు

రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ కేంద్రాన్ని కేన్స్ టెక్నాలజీ ఏర్పాటు చేసింది. రంగారెడ్డి జిల్లా కొంగర కలాన్‌లో సంస్థ ఉంది. రూ. 2800 కోట్ల పెట్టుబడితో హై-ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్ అసెంబ్లీ, త్రీడీ ఆప్టికల్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తదితర అత్యాధునిక తనిఖీ వ్యవస్థల తయారీ సాంకేతికతలను ఏర్పాటు చేయనున్నారు. 2000 మంది యువతకు ఉపాధి లభించనుంది.

## జాతీయం

**12 పారిశ్రామిక కారిడార్లు**

- దేశ వ్యాప్తంగా 12 పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేయాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఇవి పది రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. రూ 28,602 కోట్లు వ్యయం చేయనున్నారు. అలాగే వ్యవసాయ మౌలిక వసతుల నిధి పథకాన్ని విస్తరించాలని కూడా క్యాబినెట్ నిర్ణయించింది.



32 నగరాల్లో ప్రైవేట్ ఎఫ్ఎం రేడియోను ప్రవేశ పెట్టనున్నారు. ఇవి 234 నగరాలు/పట్టణాల్లో విస్తరించి ఉన్నాయి. తెలంగాణలో ఇవి 10 రానున్నాయి.

**ఆధార్‌తో గుర్తింపు**

- పరీక్ష రాసే అభ్యర్థులను గుర్తించేందుకు ఆధార్‌ను వినియోగించుకొనేందుకు యూపీఎస్సీకి కేంద్రం అనుమతి ఇచ్చింది. రిజిస్ట్రేషన్ సమయంతో పాటు మొత్తం భర్తీ ప్రక్రియలో ఈ కార్డులను గుర్తింపుగా వినియోగించుకొనేందుకు వీలుంటుంది.

**అక్షరాస్యత-సంపూర్ణాక్షరాస్యత**

- అక్షరాస్యత, సంపూర్ణాక్షరాస్యతలను కేంద్రం నిర్వచించింది. చదవడం, రాయడం, గణితం, జీవన నైపుణ్యాలు కలిగి ఉండటాన్ని అక్షరాస్యతగా ప్రకటించారు. అలాగే ఒక రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతం 95% అక్షరాస్యత సాధిస్తే దాన్ని సంపూర్ణ అక్షరాస్యతగా పరిగణిస్తారు.

**సప్నో కి ఉడాన్**

- సప్నో కి ఉడాన్ పేరుతో ఈ-మ్యాగజైన్‌ను ఆగస్ట్ 23న ప్రారంభించారు. ఆ రోజు జాతీయ అంతరిక్ష దినోత్సవం. పాఠశాల విద్య, ఎన్‌సీఈఆర్‌టీ సాయంతో ఈ-మ్యాగజైన్ వెలువడనుంది. నూతన విద్యా విధానంతో పాటు అంతరిక్ష పరిశోధనకు సంబంధించి పలు అంశాలు ఈ-మ్యాగజైన్‌లో ఉంటాయి.

**వివాహ వయస్సు 21**

- యువతుల వివాహ కనీస వయస్సును 18 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాలకు పెంచుతూ హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ నిర్ణయం తీసుకుంది. ఈ తరహా నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రం ఇది.

**నమోదు చట్టం**



- ఇస్లాం మతానికి సంబంధించి వివాహాలు, విడాకులను తప్పనిసరిగా నమోదు చేసే చట్టాన్ని అసోం శాసనసభలో ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు అమలవుతున్న 1935 చట్టం స్థానంలో తీసుకొచ్చే ఉద్దేశంతో దీన్ని ప్రవేశపెట్టారు.

**జన్‌ధన్ యోజన**

- ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకం ప్రారంభించి ఆగస్ట్ 28 నాటికి పది సంవత్సరాలు పూర్తయ్యింది. ఆర్థిక సమ్మిళిత వృద్ధిని సాధించే ఉద్దేశంతో 2014, ఆగస్ట్ 28న ప్రారంభించింది. పేదలు ఎలాంటి కనీస డిపాజిట్ లేకుండా బ్యాంక్ ఖాతాలను తెరిచేందుకు ఈ పథకంలో భాగంగా అనుమతిచ్చారు.

**వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి**

- వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని విస్తరించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఇది కేంద్ర ప్రభుత్వ రంగ పథకం. ఈ నిధిని 2020లో ఏర్పాటు చేశారు. రూ. లక్ష కోట్లతో ఇది అందుబాటులోకి వచ్చింది. అలాగే భారత రైల్వేల్లో రెండు కొత్త లైన్లతో పాటు ఒక మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్ట్‌ను కూడా అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఇందుకు రూ. 6456 కోట్లు కేటాయించారు. కొత్త రైలు మార్గాల ద్వారా 300 గ్రామాలు అనుసంధానం అవుతాయి.

**బయో ఈ3**

- బయో ఈ3 విధానానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ3 అంటే ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్, ఎంప్లాయిమెంట్ అని అర్థం. శూన్య ఉద్గారాలు సాధించే క్రమంలో భాగంగా ఆర్థికాభివృద్ధి, ఉద్యోగాల సృష్టి చేయాలన్నది ఈ విధానంలో ప్రధాన లక్ష్యం. 2070 నాటికి కార్బన్ తటస్థత సాధించాలన్నది భారత లక్ష్యం.



**ఏకీకృత పింఛన్ పథకం**

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏకీకృత పింఛను పథకాన్ని కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. 23 లక్షల మంది ఉద్యోగులు దీని ద్వారా లబ్ధి పొందనున్నారు. కనీసం 25 సంవత్సరాల ప్రభుత్వ సర్వీస్ చేసిన వారికి వర్తిస్తుంది. రిటైర్‌మెంట్ అయిన నెల నుంచి 12 నెలల ముందు బేసిక్‌లో 50% మొత్తాన్ని పింఛనుగా ఇవ్వనున్నారు. 25 సంవత్సరాల కంటే తక్కువ సర్వీస్ ఉన్న వాళ్లకు సంబంధిత నిష్పత్తిలో పింఛను లభిస్తుంది.

## అంతర్జాతీయం

**యూఎన్‌జీఏ**



- భద్రతా మండలి సంస్కరణకు సంబంధించి చర్చను తర్వాతి సెషన్‌కు ఐక్యరాజ్య సమితి సాధారణ సభ వాయిదా వేసింది. దీని పట్ల భారత్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నో ఏళ్లుగా భారత్‌తో పాటు పలు దేశాలు భద్రతా మండలి సంస్కరణలను డిమాండ్ చేస్తున్నాయి. తాజా నిర్ణయం పట్ల భారత్ వ్యతిరేకించింది. సుదీర్ఘ కాలంగా కేవలం ఐదు దేశాల శాశ్వత సభ్యత్వాన్ని కలిగి ఉండటం, తమకు అనుకూలంగా వీటో అధికారాన్ని వినియోగించుకోవడం వల్ల ఉగ్రవాదం, పర్యావరణ సమస్యలు పరిష్కారం కావడం లేదని భారత్ ఆరోపించింది.

**ప్రపంచ ఆరోగ్య సంస్థ**

- ఎంపాక్స్‌ను కట్టడి చేసేందుకు ఆరు నెలల ప్రణాళికను ప్రపంచ ఆరోగ్య సంస్థ అమలు చేయనుంది. 2024 సెప్టెంబర్‌లో ప్రారంభమై 2025 ఫిబ్రవరిలో ముగుస్తుంది. మనిషి నుంచి మనిషికి సోకకుండా, అలాగే వ్యాక్సినేషన్‌ను అభివృద్ధి చేయడం కూడా ఇందులో భాగమే. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమన్వయంలో పనిచేస్తూ వైరస్‌ను కట్టడి చేయనున్నారు.

**రౌండ్ టేబుల్**

- డిజిటలీకరణ, నైపుణ్యాభివృద్ధి, సుస్థిరత, ఆరోగ్య సంరక్షణ-వైద్యం, అధునాతన తయారీ రంగం, అనుసంధానత అనే ఆరు మూల స్తంభాల ఆధారంగా పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని భారత్, సింగపూర్ నిర్ణయించాయి. ఆ దేశంలో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.



**బోట్స్‌వానా**



- ఆఫ్రికాలోని బోట్స్‌వానాలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వజ్రాన్ని గుర్తించారు. ఇది 2492 క్యారెట్లు ఉంటుంది. ప్రపంచంలో అతిపెద్ద వజ్రం 1905లో దక్షిణాఫ్రికాలో లభించింది.

**రైట్ టు డిస్‌కనెక్ట్**

- ఆఫీస్‌లో పనివేళల తర్వాత కూడా వచ్చే ఫోన్లకు స్పందించకుండా ఉండే హక్కును ఆస్ట్రేలియా ఇచ్చింది. దీన్నే ఇంగ్లిష్‌లో రైట్ టు డిస్‌కనెక్ట్ అని పేర్కొన్నారు.

## వార్తల్లో వ్యక్తులు

**తెగ్‌బిర్ సింగ్**



- పంజాబ్‌లోని రోపర్‌కు చెందిన ఐదు సంవత్సరాల బాలుడు తెగ్‌బిర్ సింగ్ ఆఫ్రికాలోని అత్యంత ఎత్తయిన పర్వతం అయిన కిలిమంజారోను అధిరోహించారు. ఇంత చిన్న వయసులో ఈ పర్వతాన్ని అధిరోహించిన అతిచిన్న వయస్కుడైన ఆసియా వాసిగా కొత్త రికార్డును నమోదు చేశాడు.

**సతీష్ కుమార్**

- రైల్వే బోర్డ్ చైర్మన్, ప్రధాన కార్యనిర్వాహక అధికారిగా సతీష్ కుమార్ నియమితులయ్యారు.

**శ్రీనివాసన్**



- ఉగ్రవాదాన్ని అడ్డుకొనేందుకు 1984లో ఏర్పాటైన నేషనల్ సెక్యూరిటీ గార్డ్‌కు డైరెక్టర్ జనరల్‌గా శ్రీనివాసన్ నియమితులయ్యారు.

**రాజేశ్ ధన్‌కర్**

- ప్రాజెక్ట్ సీబర్డ్‌కు డైరెక్టర్ జనరల్‌గా వైస్ అడ్మిరల్ రాజేశ్ ధన్‌కర్ నియమితులయ్యారు.

**సింధు గంగాధరన్**

- నాస్కామ్ చైర్‌పర్సన్‌గా సింధు గంగాధరన్‌ను నియమించారు. నాస్కామ్ అనేది సంక్షిప్త రూపం. దీన్ని విస్తరిస్తే.. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్.

**సంజీవ్ రైనా**

- భారత్-చైనా సరిహద్దును పహారా కాసే దళానికి అదనపు డైరెక్టర్‌గా సంజీవ్ రైనా నియమితులయ్యారు. ఆయన ఐటీబీపీ విభాగానికి చెందిన అధికారి.

## తెలంగాణ

**స్పీడ్**

- తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను సిద్ధం చేసింది. 'స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ (ఎస్‌పీఈఈడీ) పేరుతో ప్రత్యేక వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 19 ప్రాజెక్టులను చేపట్టింది. పనుల పురోగతిని ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షిస్తారు.

**జహీరాబాద్‌లో పారిశ్రామిక నగరం**

- సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో పారిశ్రామిక నగరం అభివృద్ధికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జహీరాబాద్ పట్టణానికి 9 కిలోమీటర్ల దూరంలో, హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా 3245 ఎకరాల్లో రూ. 2361 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ పారిశ్రామిక నగరాన్ని అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా రూ. 10 వేల కోట్ల పెట్టుబడులు, 1.74 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని కేంద్రం ప్రకటించింది.




**నీటి వనరుల్లో ఆక్రమణలు**

- తెలంగాణలో కొన్ని చెరువులు, కుంటల్లో 75 శాతానికి పైగా విస్తీర్ణం ఆక్రమణకు గురైందని, 25 నుంచి 75% వరకు ఆక్రమణకు గురైన జల వనరులు కూడా అధిక సంఖ్యలో ఉన్నాయని కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ పేర్కొంది. రాష్ట్రంలోని 43,695 నీటి వనరులను పరిశీలించారు. ఇందులో 3032 ఆక్రమణకు గురైనట్లు నివేదికలో పేర్కొన్నారు. 211 జల వనరుల్లో 75 శాతానికి పైగా ఆక్రమణకు గురయ్యాయని మరో 402 వనరుల్లో 25 నుంచి 75 శాతం వరకు ఆక్రమణ జరిగిందని తెలిపారు.



**డాక్టర్ రఘురాం**

- ప్రముఖ బ్రెస్ట్ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ రఘురాం అంతర్జాతీయ శస్త్ర చికిత్స సమాఖ్య గౌరవ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. దీన్ని పొందిన తొలి భారతీయుడు ఆయన. కిమ్స్-ఉషాలక్ష్మి బ్రెస్ట్ డిసీజెస్ సెంటర్‌కు ఆయన వ్యవస్థాపక డైరెక్టర్.

## రోజులు-ప్రాముఖ్యం

**ఆగస్ట్ 29**

- ఏటా ఆగస్ట్ 29న అణు పరీక్షల వ్యతిరేక రోజుగా నిర్వహిస్తారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవం కూడా ఇదే రోజు. తెలుగు రాష్ట్రాల్లో ఒకటైన ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషా దినోత్సవం కూడా ఆగస్ట్ 29. ప్రపంచంలో ప్రస్తుతం 9 దేశాలు అణ్వస్త్రాలు కలిగి ఉన్నాయి. భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్య దేశాలతో పాటు భారత్, పాకిస్థాన్, ఇజ్రాయెల్, ఉత్తర కొరియా దేశాలు అణ్వస్త్రాన్ని కలిగి ఉన్నాయి. వీటిని విస్తరించకుండా చేయడం కోసం కజకిస్థాన్ యూఎన్‌జీఏలో ప్రవేశ పెట్టిన తీర్మానం మేరకు ఏటా ఆగస్ట్ 29న అణు పరీక్షల వ్యతిరేక రోజుగా నిర్వహిస్తారు. అలాగే ఆగస్ట్ 29 ధ్యాన్‌చంద్ జయంతి. భారత హాకీ జట్టును ఆయన ఉన్నత శిఖరాలకు చేర్చారు. ఆయన గుర్తుగా ఈ రోజును ఎంపిక చేశారు.

## క్రీడలు

**ఎస్ఏఎఫ్ఎఫ్ యూ-20**

- సౌత్ ఏషియన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ యూ-20 చాంపియన్‌షిప్‌లో బంగ్లాదేశ్ విజయం సాధించింది. తుదిపోరులో నేపాల్‌ను ఓడించింది. ఈ ట్రోఫీని బంగ్లాదేశ్ గెలవడం ఇదే తొలిసారి. ఆగస్ట్ 18న ప్రారంభమైన టోర్నీ 28న ముగిసింది. నేపాల్‌లో ఈ టోర్నీ జరిగింది.

**రెజ్లింగ్ చాంపియన్‌షిప్**

- అండర్-17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌ను జోర్డాన్‌లోని అమ్మాన్‌లో నిర్వహించారు. పతకాల పట్టికలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ పోటీలో బంగారు పతకాన్ని పొందిన తొలి రెజ్లర్ కజల్.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

